## క్లుప్తంగా

### సీసీ రోడ్డు పనుల పరిశీలన



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని 13వ వార్డులో టీఎఫ్ఐడీసీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం పరిశీలించారు. నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పట్టణ అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి, తాహేర్‌అలీ, ముజీబ్, షకీల్, విశ్వనాథం, రామస్వామి పాల్గొన్నారు.

### పరీక్ష ప్యాడ్ల పంపిణీ



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మొత్తం రూ. 12 వేలు విలువ చేసే పరీక్ష ప్యాడ్‌లు, స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లాస్‌మెట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ మాట్లాడుతూ విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్‌లు కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

చారకొండ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. శనివారం మండల కేంద్రంలో మాజీ జెడ్పీటీసీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ గౌడ్ సర్వే నమోదును పరిశీలించారు. సర్వే అధికారులతో వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గణేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ ఉన్నారు.

### దివ్యాంగులు దరఖాస్తులు చేసుకోవాలి

కొల్లాపూర్: వేర్వేరు ప్రమాదాల్లో గాయపడి చేతులు కోల్పోయిన దివ్యాంగులు ఉచిత ప్రోస్తటిక్ హ్యాండ్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ కోరారు. జూబ్లీహిల్స్ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో జనవరి నెలలో ప్రోస్తటిక్ హ్యాండ్‌ల పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. మోచేయి కింద, మణికట్టు పైభాగంలో చేతులు కోల్పోయిన వారు ఈ నెల 24 వతేదీలోపు పేర్లను రత్నగిరి ఫౌండేషన్ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని వివరించారు. పూర్తి వివరాలకు సెల్ నం. 9177050558 కు ఫోన్ చేయాలని కోరారు.

### విద్యార్థికి సన్మానం


కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతపల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని శ్రావణి ఇటీవల జిల్లా కేంద్రంలో సీఎం కప్ క్రీడా సంబరాలలో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించింది. శనివారం పాఠశాలలో శ్రావణితో పాటు మల్లేష్‌ను అభినందించారు.

### జిల్లా అధ్యక్షుడిగా ఇబ్రహీం



కల్వకుర్తిరూరల్: తహసీల్దార్ల అసోసియేషన్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా కల్వకుర్తి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం ఎన్నికయ్యారు. నాగర్‌కర్నూల్‌లో రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు లచ్చిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నట్లు శనివారం వారు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా సబితారాణి, అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ కార్తీక్‌కుమార్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

### లెజెండ్ అవార్డు అందజేత



కల్వకుర్తిరూరల్: వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా ఉత్తమ సేవలు అందించిన కల్మిచర్ల రమేష్‌కు లెజెండ్ అవార్డు దక్కింది. ఈ మేరకు శనివారం కల్వకుర్తిలో అవార్డును కల్మిచర్ల రమేష్‌కు జూలూరు రమేష్ బాబు అందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవలను ప్రజలకు అందిస్తానని ఇంటర్నేషనల్ స్థాయిలో అందించాలని ఆకాంక్షించారు. రమేష్‌బాబు, శంకర్, శ్రీనివాస్, రాఘవేందర్, కోటి, అంజనేయులు పాల్గొన్నారు.

### ముందస్తు అరెస్ట్ తగదు

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడికి శనివారం ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేందర్‌ను ఇంటి వద్ద నాచారం పోలీసులు శనివారం ముందస్తు అరెస్ట్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం అక్రమ అరెస్ట్‌లు చేయడం సరికాదన్నారు.

# రామానుజన్‌కు ఘన నివాళి



నాగర్‌కర్నూల్‌లో బహుమతులు అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య



తిమ్మాజిపేటలో జెడ్పీ హెచ్‌ఎస్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని శనివారం గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు నిర్వహించారు. వనపర్తి మహిళా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇ.రామరాజు యాదవ్ హాజరై మాట్లాడారు. గణితం ఆయన మేధాసంపత్తిని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, గణితంపై ఏర్పాటు చేసిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

■ తాడూరు మండలంలోని ఐతోలు పాఠశాల ఆవరణలో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. హెచ్ ఎం వీరేష్,ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

■ తిమ్మాజిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర పితామహుడు శ్రీరామనుజన్ జయంతి సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వినూత్నంగా గణితంపై రంగోళ్లు, డ్యాన్స్, ఉపన్యాస, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణశెట్టి, ఉపాధ్యాయులు స్నేహలత, గీత, శ్యామ్సన్, వెంకటేశ్వర్లు, అమరసింహారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

■ కోడేరులో మోడల్ స్కూల్, బ్లూమింగ్ బర్డ్స్, ప్రగతి, అక్షరాభ్యాస పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలు వేసి నివాళులర్పించారు. గణిత శాస్త్రంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, రఫీ, సురేష్, రామకృష్ణ, కరుణాకర్, నాగరాజు, హైమావతి, స్వప్న, భార్గవి, రాహీన్ పాల్గొన్నారు.

■ వెల్దండ మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ పాఠశాలల్లో గణిత ప్రదర్శనలు ప్రదర్శించారు. చేశారు. గణిత గుర్తులతో ముగ్గులు వేశారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ శ్రీధర్, తదితరులు ఉన్నారు.

■ చారకొండ మండలంలోని తుర్కలపల్లి యూపీఎస్ పాఠశాలలో గణిత దినోత్సవం పురస్కరించుకొని క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం మహిపాల్ నాయక్, సంధ్యారాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

■ తెలకపల్లిలోని ఎస్‌ఆర్ పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్రానికి సంబంధించిన కృత్యాలను విద్యార్థులు ప్రదర్శించి వివరించారు.

■ పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన డీఈఓ విజయ్‌కుమార్‌ను శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోడేరులో ..



వెల్దండ ఆదర్శ పాఠశాలలో..



పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాలలో..

## సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్ల నిరసన

నాగర్‌కర్నూల్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరతూ శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆశావర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య మాట్లాడుతూ ఈ నెల 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆశల సమస్యల పరిష్కారం కోసం బస్సు యాత్రను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 24న బస్సు యాత్ర నాగర్‌కర్నూల్‌కు చేరుకుంటుందన్నారు. ఆంధ్ర ప్రదేశ్, హరియాణా, మహారాష్ట్రలలో ఆశావర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చంద్రకళ, నాగలక్ష్మీ, మాణిక్యమ్మ, వెంకటమ్మ, అలివేల తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామయ్య

### జిల్లా అధ్యక్షుడికి సన్మానం

పెద్దకొత్తపల్లి: రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌నాయక్‌ను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మోహన్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన తహసీల్దార్ కార్యాలయ భవనం కార్యాలయం మార్చిన సందర్భంగా ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న అందుబాటులో ఉండి వాటిని పరిష్కరస్తామన్నారు. లింగస్వామి, శివాజీ, వెంకటేశ్వర్ రావు, వెంకటేష్, కురుమూర్తి పాల్గొన్నారు.

### ఆర్డీఓకు వినతి

ఉప్పునుంతల: మండల కేంద్రంలో మండల స్థాయి క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని శనివారం యువజన కాంగ్రెస్ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ మాధవితో పాటు తహసీల్దార్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో క్రీడా ప్రాంగణం లేక ఎన్నో ఏళ్లుగా క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో మండల కాంప్లెక్స్ ఆవరణలో క్రీడా ప్రాంగణానికి స్థలాన్ని అధికారులు చూపించినా ఆ స్థలంలో ప్రజల అవసరం మేరకు ప్రభుత్వ భవనాలు నిర్మించారని వివరించారు. రేణయ్య, కృష్ణ, లక్ష్మయ్య, మహేష్, గోవింద్‌సింగ్, శేఖర్‌గౌడ్, రేణయ్య, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్ ఉన్నారు.

### గురుకుల పాఠశాలలో పాము సంచారం



కోడేరు: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో పాము సంచరించడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. సాయంత్రం విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్తుండగా బాత్‌రూం వద్ద పాము కన్పించింది. భయాందోళనతో పరుగులు పెట్టారు. కొంతమంది విద్యార్థులు ధైర్యం చేసి పామును చంపి వేశారు. దీంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. తరుచుగా పాములు, విష పురుగులు పాఠశాల ఆవరణలోకి ప్రవేశిస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### హిందూధర్మాన్ని కాపాడుకుందాం




తెలకపల్లి: హిందూధర్మాన్ని కాపాడుకుందామని విశ్వహిందూ పరిషత్ జిల్లా ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ ఆకార వేణుగోపాల్, జిల్లా సహాయ కార్యదర్శి మారోజు ఉమాపతాచార్యులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో వీహెచ్‌పీ మండల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రాంత వ్యాప్తంగా ధార్మిక హిందూ సంఘటిత కార్యక్రమాలు నిర్వహించారు. హిందూ ధర్మ రక్ష నిధికి రూ.15 వేలను వీహెచ్‌పీ నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో గుండూరు శివకృష్ణ, పట్టణ అధ్యక్షులు త్యాలసాని రామకృష్ణ, కార్యధర్శి గుండూరు తుకారం, సభ్యులు మల్లేష్ పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



బిజినేపల్లి: మండలంలోని పాలెం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వేంకటేశ్వరస్వామి ధనుర్మాస ప్రత్యేక పూజలు రెండో రోజు శనివారం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. తెల్లవారుజామున సుప్రభాత సేవ, తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన, పుష్పార్చన, మహా మంగళ హారతి తదితర పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

### పిల్లల పెంపకం తల్లిదండ్రుల బాధ్యత



వెల్దండ: పిల్లల పెంపకం తల్లిదండ్రుల బాధ్యత అని ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు పేర్కొన్నారు. శనివారం మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో తల్లిదండ్రుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ ఆహారోత్సవంలో భాగంగా ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ప్రత్యేకంగా తయారు చేసిన వంటకాలను పాయసం, కిచిడి, పులిహోర, జీరా రైస్, తదితర వంటలను ప్రదర్శించారు. పిల్లలను జంక్‌ఫుడ్, సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పావని, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, సంగీత, శ్రీనాథ్, ప్రవీణ్, గీత, శ్రీలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గేట్ సమీపంలో ఈనెల 19న ఆటో, స్కూటీ ఢీకొన్న ఘటనలో కల్వకుర్తి చెందిన డి. శ్రీనివాసులుకు గాయాలయ్యాయి. శనివారం శ్రీనివాసులు కుమారుడు శివశంకర్ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ కొర్రబాలు నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

### పిచ్చయ్యకు నివాళి



దోమలపెంట: బాల్ బ్యాడ్మింటన్ తొలితరం క్రీడాకారుడు, అర్జున్ అవార్డు గ్రహీత, బాల్ బ్యాడ్మింటన్ పితామహుడిగా పేరు గాంచిన జమ్మలమడుగు పిచ్చయ్య జయంతి నిర్వహించారు. శనివారం ఈగలపెంటలో జెన్‌కో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు భూగర్భ కేంద్రం సీఈ కె.రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హుసేనప్ప, అనీల్‌గౌడ్, జోషి, రామ్మోహన్, వంశీ, హనుమ, బిక్కులాల్, ఎస్‌కే భాష, గోపి పాల్గొన్నారు.

## మంచి అలవాట్లతో వ్యక్తిత్వ వికాసం మెరుగు

బల్మూర్: మంచి అలవాట్లతో వ్యక్తిత్వ వికాసం మెరుగు అవుతోందని సైకాలజిస్ట్ రిటైర్డు ఆర్డీఓ హన్మంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండనాగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు ప్రత్యేక ప్రేరణ తరగతులపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు జీవన నైపుణ్యాలు, మెళకువలు పాటించి పట్టుదలతో ఏదైనా సాధించవచ్చన్నారు. ఇందుకు విద్యార్థులు తమ వ్యక్తిత్వ వికాసంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు, గురువులు దైవంతో సమానమన్నారు. చదువుతోపాటు సూర్య నమస్కారాలు, యోగ ప్రాణాయామాలు చేయడం ద్వారా ప్రతినిత్యం ఉత్సాహంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సైదులు, అధ్యాపకులు శేఖర్, శోభారాణి, అనిత, శైలజ, భార్గవి, శ్రీను, మల్లేష్, రమేష్, సత్యం, కృష్ణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ హన్మంత్‌రెడ్డి

# ధ్యానంతో ఒత్తిడి దూరం



తిమ్మాజిపేటలో ధ్యాన సాధన చేస్తున్న విద్యార్థులు

సాక్షి, నెట్‌వర్క్: ధ్యానంతో ఒత్తిడి దూరం చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ జె ప్రసాద్ అన్నారు. శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం పురస్కరించుకుని ఈగలపెంటలోని డీఏవీ ఆంగ్ల పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ధ్యాన సాధన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు విద్యార్థులు ధ్యానం చేస్తే జ్ఞాపకశక్తి మెరగవుతుందన్నారు. ధ్యానం వల్ల కలిగే లాభాలను వివరించారు.

■ తిమ్మాజిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. ధ్యానంతో ప్రశాంతత కలుగుతుందని హెచ్‌ఎం సత్యనారాయణ శెట్టి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్నేహలత, గీతిక, అనిత, వెంకటేశ్వర్లు, శ్యామ్‌సన్, అమరసింహారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

■ ఉప్పునుంతల మండల కేంద్రంలోని స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ధ్యాన సాధన చేశారు. ధ్యానం చేయడం వలన కలిగే ప్రయోజనాలను పాఠశాల హెచ్ం శ్రీనివాసులు వివరించారు. ధ్యానంతో ఏకాగ్రత, మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఉపాధ్యాయులు వెంకటేష్, చందన, సంగీత విద్యార్థులు ఉన్నారు.

■ విద్యార్థులకు ధ్యానం, యోగాపై ఆయుష్ విభాగం యోగా గురువు రవి అవగాహన కల్పించారు. తాడూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం అనిల్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తాడూరులో..



ఉప్పునుంతలలో..

## మానవత విలువలు కాపాడాలి

అచ్చంపేట రూరల్: రోజురోజుకు దిగజారిపోతున్న నైతిక విలువలు, మానవతా విలువలు కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి అన్నారు. శనివారం పట్టణంలోని కాకతీయ హైస్కూల్‌లో ధనుర్మాస మహోత్సవం వికాస తరంగిణి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్‌స్వామి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు వినయం, సంస్కారం, సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ హరితరాణి, ప్రిన్సిపాల్ విజయంనాయర్, రాము, వికాస తరంగిణి కార్యకర్తలు శివప్రసాద్, కొండలు, గోపాల్, శ్రీరాం, కల్యాణ్, లావణ్య, స్కూల్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి

### మహాసభలను విజయవంతం చేయండి



తిమ్మాజిపేట: నల్లగొండ పట్టణంలో ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ విద్య, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు నజీర్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో శనివారం యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను యూనియన్ ఉపాధ్యాయులతో కలిసి ఎంఈఓ సత్యనారాయణశెట్టి విడుదల చేశారు. రాష్ట్ర మహాసభలకు శాసన మండలి చైర్మన్, రాష్ట్ర మంత్రులు, కవులు, కళాకారులు హాజరవుతారని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు శ్రీనివాస్, రాధకుష్ణ, లక్ష్మణ్, సమీర్, హారిక, అలివేల, లక్ష్మీకాంతం, అశోక్, పాల్గొన్నారు.

### శంకర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

తాడూరు: మండలంలోని తుమ్మలసుగురుకు చెందిన మస్కూరి శంకర్(30) ఇటీవల విద్యుత్ వైర్లను సరిచేసే క్రమంలో విద్యాదాఘాతానికి గురై మృతి చెందాడు. శనివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో విద్యుత్ ఎస్ఈ పాల్‌రాజుకు వినతి పత్రం అందజేశారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, కేవీపీఎస్ శివరామ్, సైదులు, రాము తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: విద్యుదాఘాతంతో మృతి చెందిన శంకర్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ శనివారం జిల్లా కేంద్రంలో ఎస్ఈ పాల్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, నాయకులు, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, రాము, శివరాం పాల్గొన్నారు.

### ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

కల్వకుర్తిరూరల్: మండలంలోని తాండ్ర ప్రాథమిక పాఠశాలలో శనివారం ఆహార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రజిత, ప్రసన్న, తిరుపతమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: మండలంలోని కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలలలో శనివారం ఆహారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పాఠశాల హెచ్ ఎం రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు.

### సీఆర్టీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ సీఆర్టీలు 48 గంటల నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎం శంకర్‌నాయక్ మాట్లాడుతూ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలు 13 ఏళ్ల నుంచి ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీఆర్టీలు రాజ్ గోపాల్, ఆంజనేయులు, నోకియా నరేష్, భరత్, రాజు, వరలక్ష్మీ, కవిత తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు



చారకొండ: జననేత ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలోని జూపల్లిలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వైఎస్ జగన్ అభిమాన యువకులు, నాయకులు జడ్చర్ల కోదాడ ప్రధాన రహదారిపై టపాసులు కాల్చి, కేక్ కట్ చేశారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో యువకులు శ్రీనివాస్ గౌడ్, మల్లేష్, రాజు యాదవ్, కార్తీక్ యాదవ్, శ్రీకాంత్, ఆర్. శ్రీకాంత్, తిరుపతి, అల్లాజీ, పవన్, ఆనంద్ తదితరులు నాయకులు ఉన్నారు.

### అసెంబ్లీని ముట్టడిస్తాం

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్‌ఎంల నియామకానికి చేపట్టిన రాత పరీక్షను రద్దు చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర అధ్యక్షుడు ఫసియోద్దిన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం పట్టణంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని, అర్హత ఉన్నవారికి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్‌లో సర్వీస్ వేయిటేజీకి 50 మార్కులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి రామయ్య, యూనియన్ నాయకులు బాలమణి, పద్మ, అరుణ, అలివేల తదితరులు పాల్గొన్నారు.

### దాతల సహకారం సద్వినియోగం చేసుకోవాలి

తెలకపల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఎల్‌ఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రాజామహేందర్‌రెడ్డి అన్నారు. దాసుపల్లి గ్రామానికి చెందిన సీఎల్‌ఆర్ విద్యా సంస్థల సభ్యులు చీమర్ల దామోదర్‌రెడ్డి శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల మెరిట్ విద్యార్థులకు రూ.54 వేల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. హెచ్‌ఎం వెంకట్ చల్మారెడ్డి, ఉపాధ్యాయులు మురళీధర్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

### యువకుడిపై కేసు నమోదు

చారకొండ: మండలంలోని సారంబండ తండా సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన యువతి పెరుమోల పావని(22) మృతి చెందింది. యువతి తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గొల్లపల్లి చెందిన వెలకుర్తి హర్షవర్ధన్ చారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంషుద్దిన్ తెలిపారు.

### 26న సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

నాగర్‌కర్నూల్‌రూరల్: ఈ నెల 26న సీపీఐ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తునట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం బాల్‌నర్సింహ పేర్కొన్నారు. శనివారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆవిర్భవించి ఈ నెల 26 నాటికి 100 సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.